

వెంకన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, ఎంపీ

# వెంకన్న మృతి తీరని లోటు

- మంత్రి సత్యవతి
- నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, ముఖ్యనాయకులు

గూడూరు, నవంబర్ 3 : బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు, పొనుగోడు సర్పంచ్ నలమాస వెంకన్న (56) మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని స్త్రీ శిశుశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మా లోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం సాయంత్రం పొనుగోడు గ్రామంలో వెంకన్న గుండెపోటుతో మృతి చెందా డు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖ నాయకులు పొనుగోడుకు చేరుకుని వెంకన్న పార్థివదేహానికి పులమాలతో నివాళులర్పించి భార్య స్వరూప ఇద్దరు కుమార్తెలను పరామర్శించారు. కుటుంబాన్ని పార్టీ తరపున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకన్న నిబద్ధత గల నాయకుడని ఇప్పటి వరకు రాజకీయంలో ఓటమి అంటూ ఎరగని నాయకుడని, వివాదరహితుడు, గ్రామ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్నాడని అలాంటి నాయకుడు అకాల మరణం చెందడం తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న మృతిని తెలుసుక్ను వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తండోపతండాలుగా వచ్చి కడసారి వెంకన్నను చూసి రోధించారు. బీఆర్ఎస్ నుంచి బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, మండల పార్టీ అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ వీరన్న, ముక్కా లక్ష్మణ్‌రావు, సంపత్‌రావు, సురేందర్, కోడి రవి, శివ, రమేశ్, స్టాలిన్, జంపయ్య, బీజేపీ అభ్యర్థి హుసేన్‌నాయక్, ధర్మారెడ్డి, సురేందర్, మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రముఖ నాయకులు నూనావత్ రమేశ్, కత్తి స్వామి, యాకూబ్‌పాషా, శ్రీపాల్‌రెడ్డి వెంకన్న మృతదేహానికి నివాళులర్పించారు.

## 17 నుంచి స్టేట్ లెవల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

డోర్నకల్, నవంబర్ 3: హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోస్టల్ కన్వెన్షన్ హాల్‌లో శ్రుతిరావు ఆధ్వర్యంలో ఈనెల 17,18,19 తేదీల్లో స్టేట్ లెవల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ మండలోజు సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 5న ఉదయం 10 గంటలకు బయ్యారం మండలం నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎంపికైన క్రీడాకారులకు కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఠాగూర్ అమర్ సింగ్, శ్రీను, అశోక్, రాంభద్రం పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 3 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు సూచించారు. కలెక్టర్ ఆదేశానుసారం స్వీప్ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జీఎంహెచ్ నుంచి కొత్తూరు జెండా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోబాలకు గురికాకుండా విధిగా ఓటు వేయాలని కోరారు. కొత్తూర్ జెండా మీదుగా కేయూ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలు, డాక్టర్లు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, జీఎంహెచ్‌లోరి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్‌పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఉమశీ, జీఎంహెచ్ ఆర్ఎంవో డాక్టర్ సారంగం, డాక్టర్ మహేశ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తేజస్విని, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డీపీహెచ్ఎన్‌వో సుశీల, పీహెచ్ఎన్ రామేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ దయాశీల, భగవాన్‌రెడ్డి, హెడ్ నర్సులు, నర్సింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ మధు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రాజేశ్ పాల్గొన్నారు.

### ఓటు వజ్రాయుధం

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. తొలిసారిగా ఓటు వేసే యువత ఉత్సాహంతో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వరంగల్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కేడీసీలో ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సురునేని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, ఏడీ లక్ష్మణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంద్రజాల, కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# కాంగ్రెస్, బీజేపీ ఉక్కిరిబిక్కిరి

- అన్ని పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికల వరద
- హస్తం, కమలాన్ని వీడుతున్న శ్రేణులు
- అభివృద్ధికి జై కొడుతూ బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు
- కారు గుర్తుకే ఓటు అంటూ వాడవాడన ఏకగ్రీవ తీర్మానాలు
- ప్రచారంలో గులాబీల దూకుడు.. ప్రత్యర్థుల బేజారు
- ఖరారు కాని డోర్నకల్ కాంగ్రెస్, ములుగు, నర్సంపేట, హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థులు



నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నల్లబెల్లి మండలం నార

వరంగల్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ వరంగల్, (నమస్తేతెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతున్నది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ప్రతివాడలో గులాబీ అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకమవుతుండగా, ఇంకా కొన్నిచోట్ల కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులే ఖరారు కాలేదు. మరోవైపు తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధికి జై కొడుతూ కాంగ్రెస్, బీజేపీల నుంచే కాకుండా అన్ని పార్టీల నుంచి గులాబీ గూటికి వలసలు వరదలా కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని జనగామ, మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తిచేయడం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మరో అగ్రనేత హరీశ్‌రావు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. దీనికితోడు ప్రచారంలో గులాబీ అభ్యర్థులకు అన్ని వర్గాల వారు మద్దతు తెలుపుతున్నారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులు బీఆర్ఎస్‌కే జై కొడుతున్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారు. కుల సంఘాలు సైతం బీఆర్ఎస్ అభ్యర్థులకే మద్దతు తెలుపుతున్నాయి. నర్సంపేట, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమం, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచే కాకుండా పలు సంఘాల నేతలు, కార్యకర్తలు గులాబీ దళంలో కలుస్తున్నారు.

### వలసల వెల్లువ..

శుక్రవారం దుగ్గొండి మండలం గోపాలపురంలో కాంగ్రెస్ నుంచి పీఏసీసీ డైరెక్టర్ గోరంట్ల స్వప్నా భిక్షపతి, మూడో వార్డు మెంబర్ బోగం మాధవీ రమేశ్, నారాయణ తండాలో వార్డు మెంబర్ బానోత్ కవిత, నల్లబెల్లి మండలం మేడపల్లిలో మాజీ ఎంపీటీసీ పాడియ భద్ర పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. గురువారం ఇదే దుగ్గొండి మండలంలో బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు తిక్క సుభాష్ ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు డేగల శ్రీనివాస్, 14వ వార్డు కాంగ్రెస్‌లోని మైనారిటీలు, నర్సంపేట మండలం మహేశ్వరంలో కమ్యూనిస్టు నేత మోతె వీరారెడ్డి, గురిజాలలో కాంగ్రెస్ నుంచి పలువురు నేతలు, నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లెలో కాంగ్రెస్ సీనియర్ నేత భూక్య సేత్‌రామ్, మేడపల్లిలో కాంగ్రెస్, బీజేపీ, గోవిందాపురం, కొండాపురం, గుండ్లపహడ్‌లో కాంగ్రెస్ నుంచి, చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో కాంగ్రెస్, ఎంసీపీఐ పార్టీల ముఖ్యనేతలు, హట్యతండాలో కాంగ్రెస్ కార్యకర్తలు కారెక్కారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహడ్‌లో కాంగ్రెస్ నేతలు, యువ ఓటర్లు, దుగ్గొండి మండలం పీజీతండా నుంచి కాంగ్రెస్‌కు చెందిన 50 కుటుంబాలు, మల్లంపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఖానాపురం మండలం కొత్తూరులో కాంగ్రెస్ కార్యకర్తలు, నల్లబెల్లి మండలం రుద్రగూడెం నుంచి 20 కుటుంబాలు గూలాబీ గూటికి వచ్చాయి. నెక్కొండ మండలం చిన్నకోర్పోలు ఉపసర్పంచి ధర్మావత్ చంద్యా, మరికొందరు, నర్సంపేట నియోజకవర్గంలో యువత పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పరకాల నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నుంచి గీసుగొండ మండలం శాయంపేట ఎంపీటీసీ కాయిత భిక్షపతి ఎమ్మెల్యే చలా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సంగెం మండలం కృష్ణనగర్, నార్లవాయిలోనూ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు.

### వరంగల్ తూర్పులో..

వరంగల్‌తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నేతృత్వంలో కాంగ్రెస్, బీజేపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు గులాబీ దళంలో చేరుతున్నారు. శుక్రవారం కాంగ్రెస్ వరంగల్ సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే అలీ, 35వ డివిజన్‌లో పోటీ చేసిన మేరుగు అశోక్, 36వ డివిజన్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లక్క శివ, 33వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చిలువేరు రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ 33వ డివిజన్ అధ్యక్షుడు ముద్దెసాని శ్రీనివాస్ రాధిక ఎమ్మెల్యే నరేందర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. 35వ డివిజన్‌లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన కార్యకర్తలు పలువురు, 34వ డివిజన్‌లో ఎంసీపీఐ నేత గోరంట్ల శరత్‌కుమార్, పోచమ్మమైదాన్‌లో మైనారిటీ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఖిలావరంగల్ పడమరకోటలోని శ్రీభక్త మార్కండేయ పరపతి సంఘం నన్నపునేనికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పోచమ్మమైదాన్‌లో ఫకీర్‌వాడ మహిళలు నరేందర్‌ను కలిసి పూర్తి మద్దతు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, మత్స్య సహకార సంఘం సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ దీటి శ్రీధర్ ఆధ్వర్యంలో గంగపుత్రులు నన్నపునేనిని కలిసి మద్దతు ప్రకటించారు.

### ఇంకా అభ్యర్థులనే ప్రకటించలే..

నామినేషన్ల ప్రక్రియ మొదలైనా ఇప్పటికీ కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థిని ప్రకటించలేదు. ములుగు, నర్సంపేట, హుస్నాబాద్ స్థానాలకు బీజేపీ అభ్యర్థులు ఇంకా ఖరారు కాలేదు. ఇక్కడ అభ్యర్థులు దొరక్క ఇతర పార్టీల నుంచి చేరే వారి కోసం బీజేపీ ఎదురు చూస్తున్నది. పరకాల, వరంగల్ తూర్పు, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో కొత్తగా వచ్చిన వారికే బీజేపీ టిక్కెట్లు ఇచ్చింది. దీంతో అక్కడి పాత నేతలు కమలం అధిష్ఠానంపై ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఒక్క స్థానంలోనూ గెలిచే పరిస్థితి లేదని, కనీసం పోటీ ఇచ్చే విధంగానూ లేదని ఆ పార్టీ నేతలే అంటున్నారు.

### కాంగ్రెస్‌లో ఇంకా అసమ్మతి రాగం..

టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు సహకరించేది లేదని అసమ్మతి నేతలు తెగేసి చెబుతున్నారు. వరంగల్ పశ్చిమ సెగ్మెంట్‌లో జంగా రాఘవరెడ్డి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కచ్చితంగా పోటీలో ఉంటానని ప్రకటిస్తున్నారు. పరకాల, వర్ధన్నపేట, పాలకుర్తి, జనగామలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా, బీజేపీ పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది.

# వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, నవంబర్ 3 : హనుమకొండ అర్బన్ పరిధిలో నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మిని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి శాసనసభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు అందరూ వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. కళాశాల్లో యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఓటింగ్ పెంచేందుకు మిషన్-29 కింద అర్బన్‌లో 23 డివిజన్లలో 23 మంది అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఓట్ ఫర్ షూర్ అనే కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, మెప్మా డైరెక్టర్ భద్రు నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల, డీటీడబ్ల్యూవో ప్రేమకళ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, డీపీవో జగదీశ్వర్, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఆర్‌డీవో ఎల్ రమేశ్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

### జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యవయ పరిశీలకులు

హనుమకొండ, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ పంజాబ్రావ్ గవాండే శుక్రవారం సాయంత్రం హనుమకొండకు చేరుకున్నారు. ఆయనను నిట్‌లో కలిసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాలు, ఏర్పాట్లు వివరాలను ఎన్నికల వ్యవయ పరిశీలకులకు వివరించారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

సంగెం, నవంబర్ 3 : మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన చిలకలపల్లి రవి వద్ద 10లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు ఎస్సై ఎం భరత్ తెలిపారు. రవిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం..

దామెర : మండలంలోని ఊరుగొండలోని బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ పీ రమేశ్, ఎస్సై లవకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్రామానికి చెందిన చెమ్మల రాజేందర్, గొంది జయపాల్‌రెడ్డి ఇండ్లల్లో నిల్వ చేసిన రూ.4730 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దామెర పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.